## క్లుప్తంగా

### జానకిరామ్‌రెడ్డికి నివాళి



నివాళులు అర్పిస్తున్న హర్షిత్‌రెడ్డి

పాకాల: మండల వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు పవన్‌కుమార్‌రెడ్డి తండ్రి జానకిరామ్ రెడ్డికి ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఆదివారం పంటపల్లెలో జానకిరామ్‌రెడ్డి కర్మక్రియలకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కపిలీశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మునీర్, రైతు నాయకుడు భాస్కర్‌నాయుడు, రమేష్, చంటి, రహీం, నాని, చంద్రమౌళిరెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఏకలవ్యుడికి నివాళి



ఏకలవ్యుడికి నివాళులు అర్పిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: గురుదక్షిణగా ద్రోణాచార్యులకు తన బొటన వేలును సమర్పించిన విలుకాడు ఏకలవ్యుడు అని పలువురు వక్తలు కొనియాడారు. ఏపీ గిరిజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కొరమేనుగుంటలోని ఏకలవ్య నగర్‌లో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సీవీ కృష్ణయ్య, రచయిత వెంకట్రామయ్య, రిటైర్డ్ ఎస్‌బీఐ మేనేజర్ సీవీ శంకర్, గోపినాథ్‌రెడ్డి అతిథులుగా పాల్గొని ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

### శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

తిరుపతి గాంధీ రోడ్: జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని తిరుపతిలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

### ప్రణాళికబద్ధంగా సామాజిక కార్యక్రమాలు



సమావేశానికి హాజరైన ఇంపాక్ట్ అనుబంధ క్లబ్‌ల అధ్యక్షులు, శిక్షకులు

తిరుపతి కల్చరల్/తిరుపతి అన్నమయ్యసర్కిల్: సామాజిక సేవా కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజనల్ ప్రెసిడెంట్ తహసున్నీసా బేగం అన్నారు. ఆదివారం స్థానిక శిల్పారామంలో రీజనల్ క్లబ్‌ల ప్రెసిడెంట్లు, ట్రైనర్స్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ సేవలో వ్యవహరించాల్సిన నాయకత్వ లక్షణాలు ఇంపాక్ట్ బిజినెస్ అండ్ ట్రైనింగ్ గురించి వివరించారు. నేషనల్ అడ్వైజరీ బోర్డ్ మెంబర్ డాక్టర్ శ్రీధర్ విఠలం టీం వర్క్ ఎలా ఉండాలనే అంశాలపై వివరించారు. సమావేశంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్లు మాధవి, కుమార్, నారీ సెల్ ఆర్గనైజర్లు ఝాన్సీ, సాగరిక, సర్వీస్ డైరెక్టర్లు లత, జయశంకర్, ట్రైనింగ్ డైరెక్టర్ ముఖేష్ పాల్గొన్నారు.

### తిరుమలలో తమిళనాడు గవర్నర్



గవర్నర్‌కు నారాయణన్‌కు స్వాగతం పలుకుతున్న ఈఓ

తిరుమల : తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణన్ రవి ఆదివారం రాత్రి తిరుమల చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

# రాబడి..వెనుకబడి

జిల్లాలో బస్టాండ్ లేని ఏకైక ఆర్టీసీ డిపో మంగళం. అయితే జిల్లాలో రాబడిలో గతంలో వరుసగా మంగళం డిపో ముందు వరుసలో ఉండేది. ప్రస్తుతం వెనుకబడిపోతోంది. అధికారులు డిపోపై ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు తలెత్తాయని పెద్దఎత్తున విమర్శలున్నాయి. ఉదాహరణకు గతేడాది సెప్టెంబర్‌లో అంటే పది నెలల క్రితం మంగళం డిపో చుట్టూ ఉన్న ప్రహరిగోడ రెండు వైపులా కొంత భాగం పడిపోయింది. తాజాగా వారం రోజుల క్రితం పునర్నిర్మాణ పనులు మొదలుపెట్టారు. మరోవైపు డిపో లోపల భాగం అంతా గుంతలమయం అయినా పట్టించుకునే నాథుడు లేడని పలువురు డ్రైవర్లు వాపోతున్నారు.

- నెల రాబడి రూ.4.45 కోట్లు అయితే ఖర్చులు రూ.5.45 కోట్లు
- ఈ లెక్కన మంగళం డిపోకు నెలకు రూ.కోటి నష్టం
- కనీస సౌకర్యాల కల్పనపై ఆర్టీసీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం
- బస్టాండ్ ఏర్పాటుపై ఒక్క అడుగూ పడని వైనం
- తాజాగా డిపో నుంచి 50 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణకు సన్నాహాలు



గత ఏడాది సెప్టెంబర్‌లో కూలిపోయిన మంగళం డిపో ప్రహరీగోడ(ఫైల్)



బస్టాండ్ కోసం మంగళం డిపో పక్కనే కేటాయించిన రెండు ఎకరాలు

తిరుపతి అర్బన్: మంగళం డిపో బస్సులను కొన్నింటిని తిరుపతి డిపో నుంచి నడుపుతున్నారు. ఈ క్రమంలో డిపో పక్కనే తిరుపతి–కరకంబాడి ప్రధాన రహదారి పక్క ఉన్న రెండు ఎకరాల స్థలంలో మంగళం డిపో బస్టాండ్ ఏర్పాటుపై ఏడాదిగా చర్చసాగుతోంది. ఇప్పటికే విజయవాడ నుంచి ఈడీలతో పాటు ఎండీలు పలుమార్లు ఆ రెండు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. అయితే బస్టాండ్ ఏర్పాటు చేసేదిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శలు ఉన్నాయి. అయితే డిపోకు తిరుమల సర్వీసులతోనే కాస్తా రాబడి వస్తోంది. మిగతా మార్గాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**గతంలో ఆదాయం..ఇప్పుడు నష్టం..**

మంగళం డిపో నెల రాబడి గతంలో రూ.5.5 కోట్ల నుంచి రూ.6.5 కోట్ల మేరకు వచ్చేది. ప్రస్తుతం రూ.4.5 కోట్లకు పడిపోయినట్లు తెలుస్తోంది. ఖర్చులు మాత్రం రూ.5.5 కోట్లు అవుతున్నాయి. అంటే నెలకు మంగళం డిపో ద్వారా ప్రభుత్వానికి రూ.కోటి మేరకు నష్టం వస్తున్నట్లు చర్చసాగుతోంది.

గత వైఎస్సార్‌సీపీ సర్కార్‌లో 2021లో అలిపిరి డిపో కేంద్రంగా 100 విద్యుత్ బస్సులను ఆపరేటింగ్ చేస్తున్న సంగతి తెలిసిందే. అందులో 50 సర్వీస్‌లు తిరుమలకు, 14 సర్వీస్‌లు రేణిగుంట ఎయిర్ పోర్ట్‌కు, 12 సర్వీస్‌లు నెల్లూరుకు, 12 సర్వీస్‌లు కడపకు, 12 సర్వీస్‌లు మదనపల్లెకు నడుపుతున్నారు. అయితే త్వరలో జిల్లాకు 50 విద్యుత్ బస్సులు వస్తున్నాయని అధికారులు పది రోజులుగా హడావుడి చేస్తున్నారు. ఆ 50 సర్వీసులను మంగళం డిపో కేంద్రంగా ఆపరేటింగ్ చేయనున్నారు. అయితే డిపో లోపలి భాగం అంతా గుల్లబారిపోవడంతో మరమ్మతులు చేయాల్సి ఉంది. ఈ అంశాన్ని పట్టించుకోకుండా చార్జింగ్ పాయింట్లు ఎక్కడ పెట్టాలి ? 50 విద్యుత్ సర్వీస్‌లను ఎక్కడ పార్కింగ్ చేయాలి ? సాధారణ బస్సులను ఎక్కడ పార్కింగ్ చేయాలనే అంశాలపైనే అధికారుల హడావుడి జరుగుతోంది.

**మంగళం డిపో సమాచారం**

| | |
|---|---|
| బస్సుల సంఖ్య | – 78 |
| కండక్టర్లు | – 96 మంది |
| డ్రైవర్లు | – 230 మంది |
| మెకానిక్‌లు, ఇతర సిబ్బంది | – 104 |
| మొత్తం ఉద్యోగులు | – 430 మంది |
| నెలకు రాబడి | – రూ.4.45 కోట్లు |
| డీజిల్ ఖర్చు | – రూ.2.90 కోట్లు |
| ఉద్యోగుల జీతాలు | – రూ. 2.40 కోట్లు |
| మెయింటినెన్స్ ఖర్చులు, రిపేర్లు | – రూ.15 లక్షలు |
| జీతాలు, డీజిల్, ఇతర ఖర్చులు | – రూ.5.45 కోట్లు |
| ఈ లెక్కన డిపోకు వస్తున్న నష్టం | – రూ.కోటి |

**ఆదాయాన్ని పెంచేదిశగా అడుగులు**



మంగళం డిపో ఆదాయాన్ని పెంచేదిశగా అడుగులు వేస్తున్నాం. జిల్లాలో బస్టాండ్ లేని డిపో మంగళం వాస్తవమే. పక్కనే ఉన్న రెండు ఎకరాల స్థలంలో బస్టాండ్‌ను ఏర్పాటు చేయడానికి విజయవాడ ఉన్నతాధికారులు పరిశీలన చేశారు. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు మంగళం డిపో కేంద్రంగా 50 విద్యుత్ బస్సులు రానున్నాయి. ఆ దిశగా పరిశీలన చేస్తున్నారు. విద్యుత్ బస్సులు వస్తే మంగళం డిపో ఆదాయం పెరగడంతోపాటు మెరుగైన సౌకర్యాలతో రూపుదిద్దుకోనుందని భావిస్తున్నాం.

– కేసీడీ భాస్కర్, మంగళం డిపో మేనేజర్

## నోటీస్ బోర్డు

- అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 8 గంటలకు అష్టాదళ పాద పద్మారాధన సేవ
- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక. 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరణ
- శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 గంటలకు కలశపూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ
- శ్రీగోవిందరాజస్వామి జ్యేష్టాభిషేకంలో భాగంగా ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజలు, శాత్తుమొర, ఆస్థానం, సాయంత్రం 5 గంటలకు ఆలయ మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు

### జాబ్‌మేళాలో 24 మంది ఎంపిక



మేళాను ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో ఆదివారం జాబ్‌మేళా నిర్వహించారు. వైస్ చాన్సలర్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఈ మేళాను ప్రారంభించారు. ఈ మేళాలో 53 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 24 మంది ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ తదితరులు పాల్గొన్నారు.

### పవిత్రోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ చేస్తున్న అర్చక పండితులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 7, 8, 9 తేదీల్లో జరగనున్న పవిత్రోత్సవాలకు ఆదివారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ వేడుకగా చేపట్టారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే వివిధ అర్చనలు, ఉత్సవాల నేపథ్యంలో తెలియక జరిగే దోషాలతో ఆలయ పవిత్రతకు లోపం రాకుండా శైవాగమ శాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు చేపట్టడం ఆనవాయితీ. ఇందులో భాగంగా 7న సోమవారం ఉదయం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం కలశ పూజ, హోమం, పవిత్ర ప్రతిష్ట నిర్వహిస్తారు. 8న ఉదయం గ్రంథి పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాల పూజ, హోమం చేపడతారు. 9న ఉదయం మహా పూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వార్ల పురవీధి ఉత్సవం ఉంటుంది.

### వేడుకగా గోవిందుడి జ్యేష్టాభిషేకం



శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి వారి ఆలయంలో మూడురోజుల పాటు తలపెట్టిన జ్యేష్టాభిషేకం ఉత్సవాలు ఆదివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఆషాఢమాసంలో శ్రీగోవిందరాజస్వామి వారికి జ్యేష్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి కైంకర్యాలు, శతకలశ స్నపన తిరుమంజనం, మహా శాంతి హోమం చేపట్టారు. అనంతరం ఆలయంలోని కల్యాణ మండపానికి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి అక్కడ ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామివారి కవచాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కవచాధివాసం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారు తిరుచ్చిపై కొలువై ఆలయ మాడవీధుల్లో విహరించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ వీఆర్ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### భౌతికంగా దూరమైనా సేవలతో అందరి గుండెల్లో..!



సర్పంచ్ సుభాషిణి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని చెర్లోపల్లె సర్పంచ్ బొల్లినేని సుభాషిణి ఇంటి వద్ద ఆదివారం దశ దిన కర్మక్రియలను నిర్వహించారు. పార్టీలకతీతంగా తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలకు చెందిన నాయకులు హాజరయ్యారు. గత నెల 26న ఆమె హఠాన్మరణం చెందడం విదితమే. వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సుభాషిణి భర్త శుభగిరి నాయుడుతో పాటు కుమారులను పరామర్శించారు. సర్పంచ్ సేవలను స్మరించారు. ఆమె భౌతికంగా దూరమైనా ప్రజలకు చేసిన సేవలతో అందరి గుండెల్లో ఉందని అన్నారు. అలాగే చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డితో పాటు పలువురు టీడీపీ, జనసేన, వైఎస్సార్ సీపీ నాయకులు, చెర్లోపల్లెకు చెందిన వీరపల్లి వాసుదేవనాయుడు, కొత్తపాటి మునీశ్వరరెడ్డి, విడుదల మాధవరెడ్డి, మల్లం చంద్రమౌళిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, చిన్ని యాదవ్, చెంచు మోహన్ యాదవ్, గోపి, దొరస్వామి, చెంగల్‌రెడ్డి హాజరయ్యారు.

### కార్మికుల సత్తా చాటుదాం



స్కూటర్ ర్యాలీ చేపడుతున్న కార్మిక సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరిస్తూ ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టే సార్వత్రిక సమ్మెలో కార్మికులు భాగస్వాములై సత్తా చాటాలని పలు కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి నగర వీధుల్లో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికు సంఘాల నేతలు మాట్లాడుతూ కేంద్రం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడంతో యావత్ కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థంగా మారనుందన్నారు. అవి అమలైతే పోరాడి సాధించుకున్న హక్కులను కార్మికులు కోల్పోయే ప్రమాదం ఉందని, వాటిని వ్యతిరేకిస్తూ చేపట్టే సార్వత్రిక సమ్మెలో ఉద్యోగ, కార్మికులు, యువజన సంఘాలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నేతలు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

### సమాజాభివృద్ధికి జగ్జీవన్ రామ్ విశేష కృషి

–ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



నివాళులు అర్పిస్తున్న సీఎండీ సంతోషరావు, డైరెక్టర్లు, సీనియర్ అధికారులు

తిరుపతి రూరల్: సమాజాభివృద్ధికి బాబూ జగ్జీవన్ రామ్ విశేష కృషి చేశారని ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ – మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు స్మరించారు. తిరుపతి డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఆయన మాట్లాడారు. జగ్జీవన్ రామ్ సుదీర్ఘకాలంపాటు దేశ పరిపాలన, ఆర్థిక వ్యవహారాల్లో ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆయన కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రిగా ఉన్న సమయంలో దేశంలో ఆహార సమస్య పరిష్కారానికి అవిరళ కృషి చేశారన్నారు. అలాగే రక్షణ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు బంగ్లాదేశ్ సమస్యను చాకచక్యంగా పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్ ఖాన్, జనరల్ మేనేజర్ వై.వెంకటరాజు, జీవిఎస్ఆర్ మూర్తి, టి.మధుసూదన్, పీఎం జైకేష్ యాదవ్, జి.అంజనప్ప, వెంకటసుబ్బయ్య, ప్రసాద్, ఎస్‌కె.నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

**బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి**

తిరుపతి మంగళం : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యతోనే సమాజంలో గౌరవం





సీబీఎస్ఈలో అత్యధిక మార్కులు సాధించిన వికాస్, ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి

ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

తిరుపతి కల్చరల్ : విద్యతోనే సమాజంలో గౌరవ, మర్యాదలు దక్కుతాయని ఎమ్మెల్సీ, రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఈ ఏడాది జరిగిన పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 27 మంది జర్నలిస్టుల పిల్లలకు నగదుతో కూడిన అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిఆంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిపాయి మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లుగా జర్నలిస్ట్ పిల్లలకు ప్రతిభా అవార్డులను అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మురళి, బాలచంద్ర మాట్లాడుతూ జర్నలిస్టు పిల్లలను ప్రోత్సహించడంతో పాటు విద్యతో కలిగే ప్రయోజనాలను తెలియచెప్పాలన్న సంకల్పంతోనే ఈ అవార్డుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సిపాయికి ప్రెస్‌క్లబ్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు లావణ్య కుమార్, జాయింట్ సెక్రటరీ జగదీష్, విజయ్ యాదవ్, ఈసీ మెంబర్‌లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### సాగర్‌లో సాహసం చేయాల్సిందే !



పిచ్చిమొక్కలను, ముళ్లకంపలను తొలగిస్తున్న వాకర్లు

తిరుపతి తుడా: నగరానికే తలమానికంగా ఉన్న వినాయక సాగర్ నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. పట్టణ ప్రజలు ఇక్కడికి వాకింగ్‌కు వస్తారు. అయితే ఎటు చూసినా ముళ్లకంపలు..మురుగు..చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలే. నీరు కలుషితమై దుర్వాసన వస్తోంది. వాకింగ్ ట్రాక్‌లకు ఇరువైపులా ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో వాకర్సే ఇటీవల పిచ్చిమొక్కలు తొలగించారు. జిమ్ చేసే పరికరాలు కొన్ని దెబ్బతిన్నాయి. అధికారులు సాగర్‌ను పర్యవేక్షించాలని వాకర్స్ కోరుతున్నారు.



### ద్రౌపదమ్మకు సారె సమర్పించిన హర్షిత్‌రెడ్డి

–మహాభారత ఉత్సవాలకు రూ.లక్ష విరాళం



లక్ష రూపాయలు విరాళమిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని ముండ్లపూడిలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం ప్రదర్శించారు. దీనికి సర్పంచ్ సురేష్‌రెడ్డి (సూరి) కుటుంబీకులు ఉభయదారులు వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ద్రౌపదమ్మకు సారె సమర్పించారు. అలాగే ఆలయ అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణకు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి విరాళమిచ్చారు. ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు.

**వేమూరు నుంచి పసుపు, కుంకుమలు రాక**

వేమూరుకు చెందిన పెద్దలు ద్రౌపదమ్మకు పసుపు, కుంకుమను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ ఊరేగింపులో యాదవ కులానికి చెందిన వీరజాట్లు కొలుపు భక్తులను ఆకట్టుకుంది. విడుదల మాధవరెడ్డి, హేమాద్రిరెడ్డి, తిరుమలయ్య, కుప్పిరెడ్డి, వెంకటరమణ, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

# బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



చంద్రబాబు మోసాల మేనిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అభినయ్‌రెడ్డి, నేతలు

తిరుపతి మంగళం : అధికారం దాహంతో నోటికి వచ్చిన అబద్ధపు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం రీకాల్ చంద్రబాబు మోసాల మేనిఫెస్టో పోస్టర్‌ను ఆవిష్కరించి, అందులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నమ్మిన వాళ్లను నయవంచన చేయడానికి కూడా వెనుకాడని ప్రజాద్రోహి చంద్రబాబు అన్నారు. ఆయన ఏదైనా చెస్తానని ష్యూరిటీ ఇచ్చాడంటే అది గ్యారెంటీగా మోసమేనన్న విషయాన్ని ప్రజలంతా గ్రహించాలన్నారు. గత ఎన్నికల్లో జగనన్న కంటే రెండింతలు సంక్షేమ పథకాలు అందిస్తానంటూ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏడాది కాలం అవుతున్నా ఏ ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేదని మండిపడ్డారు. గత ఐదేళ్ల జగనన్న పాలనలో ప్రతిపేదవాడి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. చంద్రబాబు మోసాలను ఎండగట్టి ప్రజలకు ఇచ్చి హామీలను గుర్తు చేసేందుకు ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళదామని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు అనీష్‌రాయల్, బోకం అనిల్‌కుమార్, కోటేశ్వరమ్మ, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్ పోలిరెడ్డి నాగిరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా తిరుమలరెడ్డి



నియామకపత్రం అందజేస్తున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : తనపై నమ్మకంతో ఉన్నత పదవిని కల్పించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డికి రుణపడి ఉంటానని, వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం మరింత బాధ్యతగా పనిచేస్తానని వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఈసంబాడి తిరుమలరెడ్డి అన్నారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఈసంబాడి తిరుమలరెడ్డికి భూమన అభినయ్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. వైఎస్సార్‌టీయూసీ నాయకుడిగా కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని, అలాగే పార్టీ బలోపేతానికి శ్రమించాలని ఆయన సూచించారు. పార్టీలో తనకు ఉన్నత పదవులు కల్పించిన చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, భూమన అభినయ్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని తిరుమలరెడ్డి తెలిపారు. పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ పాల్గొన్నారు.